News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :191 | ఖమ్మం | సోమవారం, ఆగస్టు 25, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# సురవరం సుధాకర్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు

- నివాళి అర్పించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు
- మగ్దూంభవన్ నుంచి గాంధీ ఆసుపత్రి వరకు అంతిమయాత్ర
- గాంధీ వైద్య కళాశాలకు పార్థివదేహం అప్పగింత







అనారోగ్యంతో కన్నుమూసిన కమ్యూనిస్టు దిగ్గజం, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి కుటుంబసభ్యులు, వివిధ పార్టీల నేతలు, సీపీఐ కార్యకర్తలు ఆదివారం అంతిమ వీడ్కోలు పలికారు. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు.. తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మగ్దూంభవన్‌లో


వివరాలు 2లో..

# గణేష్ మండపాలకు ఫ్రీ కరెంట్

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- అనుమతి ఉన్న మండపాలకే ఈ సౌకర్యం వర్తింపు
- ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలు
- వేగంగా జరుగుతున్న హైదరాబాద్ గణేశ్ మండపాల ఏర్పాటు
- తుది దశకు చేరిన ప్రఖ్యాత ఖైరతాబాద్ గణపతి విగ్రహం పనుల





హైదరాబాద్: తెలంగాణలో గణేష్ మండపాల నిర్వాహకులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు, దసరా సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గా మాత మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మండపాలను తాత్కాలికంగా మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్, అగ్ని ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు పోలీసులు ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. మండపాల వద్ద ఇసుక సంచులు, నీటి డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. పీవోపీ విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలను పెట్టి పర్యావరణానికి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నిమజ్జన చివరి రోజున రద్దీని తగ్గించేందుకు మూడు లేదా 5, 7రోజున నిమజ్జనం చేసుకునే విధంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఫిట్ నెస్ ఉన్న వాహనాలను మాత్రమే నిమజ్జనానికి ఉపయోగించాలన్నారు. ముందస్తు అనుమతులతో మాత్రమే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని, డీజేలకు అనుమతి లేదన్నారు. మతపరమైన ప్రదేశాల వద్ద జెండాలు, పోస్టర్లు, బ్యానర్లు ఉంచకూడదని, రద్దీగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ లు నిషేధమని స్పష్టం చేశారు. విరాళాలు స్వచ్ఛందంగా మాత్రమే తీసుకోవాలన్నారు. అలాగే మండలాల వద్ద మద్యం సేవించడం, జూదం వంటి ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 10వ రోజు నిమజ్జనంతో పాటు మిలాద్?-ఉన్-నబీ ఉండడంతో శాంతిభద్రతలపై పోలీసు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

# మరోసారి మాదే అధికారం



- కులం, మతం అనకుంటే బండి సంజయ్ గెలిచేవారా!
- జనహిత యాత్రలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

వివరాలు 2లో..

---

## ఆకాశంలో భారత్‌కు అభేద్య కవచం.. డీఆర్‌డీవో మరో ఘన విజయం



- భారత రక్షణ రంగంలో మరో కీలక మైలురాయి
- ఐఏడీడబ్ల్యూఎస్ తొలి ప్రయోగ పరీక్ష విజయవంతం
- ఒడిశా తీరంలో పరీక్షను నిర్వహించిన డీఆర్‌డీవో
- శత్రువుల నుంచి గగనతలానికి బహుళస్థాయి రక్షణ
- డీఆర్‌డీఓ బృందాన్ని అభినందించిన మంత్రి రాజ్‌నాథ్ సింగ్

వివరాలు 2లో..



# సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం

- వివాదం ఉండొద్దనే కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపాను
- అందరూ చట్టం పరిధిలో పనిచేయాల్సిందే
- నిర్మాతలు, దర్శకులతో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వం నుంచి సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలో పని వాతావరణం బాగుండాలని కోరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆదివారం రేవంత్‌రెడ్డిని పలువురు తెలుగు సినీ నిర్మాతలు, దర్శకులు కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. “పరిశ్రమలోకి కొత్తగా వచ్చేవారి నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. స్కిల్స్ యూనివర్సిటీలో సినిమా పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం. తెలుగు సినిమా రంగం అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది. రాష్ట్రంలో ముఖ్యమైన పరిశ్రమగా మారింది. పరిశ్రమలో వివాదం ఉండకూడదని కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపించాను. నిర్మాతలు, కార్మికుల అంశంలో సంస్కరణలు అవసరం.

వివరాలు 2లో..

# నేడు ఢిల్లీలో న్యాయకోవిదులతో సీఎం భేటీ

- ‘స్థానికం’లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల కల్పనకు అనుసరించాల్సిన విధానంపై చర్చ
- పాల్గొననున్న భట్టి, ఉత్తమ్
- మంత్రుల కమిటీ సమావేశంలో నిర్ణయం



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి అనుసరించాల్సిన విధానంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రముఖ న్యాయ కోవిదులతో భేటీ కానున్నారు. ఇందుకోసం సీఎంతోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం దేశరాజధానికి వెళ్లనున్నారు. న్యాయకోవిదులతో చర్చించి వారి అభిప్రాయాలను సేకరించాలని

వివరాలు 2లో..

## సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- పదవులకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో గెలవాలని డిమాండ్
- 20 నెలల పాలనపై రేవంత్ రెడ్డి ప్రజాతీర్పు కోరాలని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు, హైడ్రా ఆగడాలపై తీవ్ర విమర్శలు
- కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గుర్తు చేసిన కేటీఆర్
- నాయకులు మోసం చేసినా కార్యకర్తలు పార్టీతోనే ఉన్నారని ప్రశంస



వివరాలు 2లో..

# సురవరం సుధాకర్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు

- మొదటి పేజి తరువాయి

సురవరం పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. సీపీఎం, సీపీఐ ప్రధాన కార్యదర్శులు ఎంఏ బేబీ, డి.రాజా, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు తదితర ప్రముఖులు సురవరం భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సంతాప సందేశాన్ని పంపారు. సురవరం కోరిక మేరకు ఆయన భార్య విజయలక్ష్మి, కుమారులు కపిల్, నిఖిల్‌లు పార్థివ దేహాన్ని వైద్యవిద్య బోధన నిమిత్తం గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించారు. సురవరం భౌతికకాయాన్ని ఎంబామింగ్(రసాయనాల పూత) చేసి భద్రపరుస్తామని... వైద్య విద్యార్థుల పరిశోధనలు, శరీర నిర్మాణం, శాస్త్రీయపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగిస్తామని గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఇందిర తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్ వద్ద మధ్యాహ్నం 3:20 గంటల ప్రాంతంలో సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి రాష్ట్రప్రభుత్వ అధికార లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించారు. పోలీసులు, రెడ్ ఆర్మీ వాలంటీర్లు కవాతు చేస్తుండగా ప్రజానాట్య మండలి కళాకారుల గేయాల నడుమ అంతిమయాత్ర మగ్దూంభవన్ నుంచి గాంధీ వైద్య కళాశాల వరకు సాగింది. దారిపొడవునా కామ్రేడ్..అమర్‌రహే అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు గాంధీ వైద్య కళాశాల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

**సురవరం పేరు శాశ్వతంగా నిలిచిపోయే నిర్ణయం**

'సుదీర్ఘ రాజకీయ జీవితంలో సురవరం రాజీపడకుండా సిద్ధాంతపరంగా పోరాడారు. వివిధ హోదాల్లో పనిచేసినా నిరాడంబర జీవితాన్ని గడిపారు. సుధాకర్‌రెడ్డి మరణం తెలంగాణకు, పేదలకు తీరనిలోటు. మా పాలమూరు బిడ్డ ఏఐఎస్‌ఎఫ్ నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంటు సభ్యుడుగా ఎదగడం మాకెంతో గర్వకారణం. ఆయన కోరిక మేరకు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాం. సురవరం సుధాకర్‌రెడ్డి పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటాం. ఆయన కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటాం.

**రేవంత్‌రెడ్డి, తెలంగాణ సీఎం**

**ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడారు**

'సురవరం కమ్యూనిస్టు ఉద్యమంలో, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయన ఓ పోరాటయోధుడు. ఆయనతో నాకు సుదీర్ఘకాలంగా రాజకీయ స్నేహం ఉంది. సురవరానికి నేనంటే ప్రత్యేకమైన అభిమానం ఉండేది. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రజాహితం కోసం ఇద్దరం కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం. ఆయన మరణం సీపీఐకి మాత్రమే కాదు..యావత్ దేశానికే తీరని లోటు.

**చంద్రబాబునాయుడు, ఏపీ ముఖ్యమంత్రి**

# నేడు ఢిల్లీలో న్యాయకోవిదులతో సీఎం భేటీ

- మొదటి పేజి తరువాయి

ఈ అంశంపై ఏర్పాటైన రాష్ట్ర మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ సమావేశమై అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో చర్చించింది. కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. మరో సభ్యుడైన మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో తన అభిప్రాయాన్ని తెలియజేశారు. న్యాయపరమైన అవరోధాలు లేకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఎలా ముందుకెళ్లాలని మంత్రుల కమిటీ చర్చించింది. రాష్ట్రంలో కులగణన చేపట్టి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాసనసభలో బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపామని భట్టి వివరించారు. అది గవర్నర్ నుంచి రాష్ట్రపతి వద్దకు వెళ్లిందని.. అక్కడ 5 నెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. మరోవైపు సెప్టెంబరు 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో న్యాయపరమైన వివాదాలు ఏర్పడకుండా రిజర్వేషన్ కల్పించాలంటే ఏం చేయాలో సలహా ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ అభిప్రాయం కోరారు. ఇతర రాష్ట్రాల్లో గతంలో రిజర్వేషన్ల పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే కోణంలో ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది. ఈ విషయంలో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తదితరుల అభిప్రాయాన్ని తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది.

గవర్నర్‌లకు గడువుపై రాష్ట్రం తరఫున వాదనలు..

మరోవైపు బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతి, గవర్నర్‌లకు నిర్దిష్ట గడువు ఉండేలా చూడాలని సుప్రీంకోర్టులో ఇప్పటికే కేసు విచారణలో ఉంది. ఆ కేసులో తెలంగాణ తరఫున బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం గురించి ప్రస్తావించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రం తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను నియమించాలని యోచిస్తోంది. ఈ విషయంపైనా సోమవారం దిల్లీలో న్యాయకోవిదులతో రేవంత్‌రెడ్డి, భట్టి, ఉత్తమ్ చర్చించనున్నారు. రిజర్వేషన్ల అంశంపై ఎలా ముందుకెళ్లాలనేది తేలిన తర్వాత ఈ నెల 29న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఈలోగా కాంగ్రెస్ సీనియర్ నేతల కమిటీ కూడా అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందని పీసీసీ వర్గాలు తెలిపాయి. అధికారికంగా రిజర్వేషన్ల అమలుకు గట్టి చర్యలు తీసుకునే ఉద్దేశంతోనే మంత్రుల, కాంగ్రెస్ నేతల కమిటీలు అధ్యయనం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

# ఆవిష్కరణల కేంద్రమవ్వాలి

ప్రపంచంలో ప్రస్తుతం అనిశ్చిత పరిస్థితులు కనిపిస్తున్నాయని.. పన్నులు, యుద్ధాలు, వాణిజ్యపరమైన అడ్డంకుల వంటివి ఎదురవుతున్న ఈ తరుణంలో ప్రపంచ అవసరాలకు కావాల్సిన ఆవిష్కరణలకు తెలంగాణ కేంద్రంగా మారాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో దేశానికే రాష్ట్రం కేంద్రబిందువుగా ఉందన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో ఆదివారం జరిగిన 'బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్'లో ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

**సుల్తాన్‌పూర్‌లో 60కి పైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు**

"బయోడిజైన్ ఆవిష్కరణల సదస్సులో పాల్గొనడం ఆనందంగా ఉంది. కృత్రిమ మేధస్సు బయోడిజైన్‌కు మంచి ఉదాహరణ. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 నినాదంతో ప్రయాణాన్ని ప్రారంభించింది. 2034 నాటికి రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నాం. 100వ స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించే 2047 నాటికి మన రాష్ట్రం మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థకు చేరుకోవాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. ఫార్మా, బయోటెక్, లైఫ్‌సైన్సెస్, మెడ్‌టెక్ వంటివి హైదరాబాద్‌లో అత్యంత కీలకమైనవి. తయారీరంగం నుంచి ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను మారుస్తున్నాం. సుల్తాన్‌పూర్‌లో 302 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద వైద్య పరికరాల పార్కును ఏర్పాటు చేశాం. ఇక్కడ పరిశోధన, పరీక్ష, తయారీ కోసం ఉత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. 60కి పైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు పనిచేస్తున్నాయి. డయాగ్నొస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్‌లో పెట్టుబడులు వస్తున్నాయి. స్థానిక అంకురాలు, ఎంఎస్‌ఎంఈలు గ్లోబల్ కంపెనీలతో పాటు కలిసి పనిచేస్తున్నాయి.

**కొత్త ఆవిష్కరణలకు ఏఐజీ లాంటి సంస్థలు ముందుకురావాలి**

సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరిశోధనలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి సేవలు అభినందనీయం. చాలా ఏళ్లుగా మన మేధస్సుని ఇతర దేశాల ప్రజల కోసం ఉపయోగిస్తున్నాం. ఇప్పుడు మన ప్రజల మంచి కోసం పనిచేయాల్సిన సమయం వచ్చింది. మరిన్ని కొత్త ఆవిష్కరణలు చేసేందుకు ఏఐజీ లాంటి సంస్థలు ముందుకు రావాలి. మా ప్రభుత్వం నుంచి పూర్తిగా సహకరిస్తాం. డేటా గోప్యతను పాటిస్తూనే ఇక్కడ ప్రజల వైద్యసహాయం కోసం అవసరమైన పూర్తి సమాచారం అందజేస్తాం. స్కిల్స్ యూనివర్సిటీ, కార్పొరేషన్లు, విద్యాసంస్థలు, పరిశోధన కేంద్రాలతో అనుసంధానం చేస్తాం. మానవాళిని మరింత ఆరోగ్యంగా మార్చడానికి మనందరం ప్రయత్నం చేద్దాం" అని సీఎం పేర్కొన్నారు. అంతకుముందు రేవంత్‌రెడ్డి జీవిత ప్రస్థానంపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. భారత్ బయో డిజైన్ డాక్యుమెంట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

**30-40% మంది చిన్నారుల్లో నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ : డాక్టర్ నాగేశ్వరరెడ్డి**

వైద్య రంగంలో ఆవిష్కరణలు రోగికి ఉపయుక్తంగా ఉండాలని డాక్టర్ నాగేశ్వరరెడ్డి అన్నారు. "ఆసియా పసిఫిక్ బయో డిజైన్ 10వ వార్షిక సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా 2030 నాటికి వైద్యరంగ ఆవిష్కరణల్లో మన దేశం స్వయం ప్రతిపత్తి సాధించాలనే దిశగా కేంద్రం రోడ్ మ్యాప్ రూపొందిస్తుండడం వైద్య సాంకేతికతలో గొప్ప ముందడుగు. నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ జబ్బు రోజురోజుకు పెరిగిపోతోంది.ం

30-40 శాతం మంది చిన్నారుల్లో ఇది కనిపిస్తుంది. మేము చేపట్టిన ఎన్‌సీడీ సర్వేలో స్పష్టమైంది. తగిన వ్యాయామం లేకపోవడం వల్లే ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఇది ఆందోళనకరం' అని డాక్టర్ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర బయోటెక్నాలజీ విభాగానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ అనామికా గంభీర్ మాట్లాడుతూ దేశీయంగా అనేక రకాల వైద్య పరికరాలను రూపొందించేందుకు వేల సంఖ్యలో అంకురాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాకేశ్ కలపాల, డాక్టర్ జీవీరావు, ఆసియా పసిఫిక్ బయో డిజైన్ కూటమి స్టీరింగ్ ఛైర్మన్ డాక్టర్ అనురాగ్ మైరాల్‌తో పాటు, దేశవిదేశాల బయో డిజైన్ పరిశోధకులు పాల్గొన్నారు.

# మరోసారి మాదే అధికారం

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాల్లో విజయం సాధించి రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండో విడత జనహిత పాదయాత్రను ఆదివారం సాయంత్రం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఉప్పరమల్యాలలో ప్రారంభించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరైన యాత్రకు కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చారు. రాత్రి గంగాధరలో నిర్వహించిన కూడలి సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. 'రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పని అయిపోయింది. భాజపా అక్కడక్కడ పచ్చగడ్డిలా ఉంది. మేం దేవుడి పేరిట ఓట్లు అడగలేదు. అభివృద్ధి చేసి ఓట్లు అడిగే దమ్మున్న పార్టీ మాది. కులం, మతం అనకుంటే కరీంనగర్‌లో బండి సంజయ్ గెలుస్తారా? దేశంలో భాజపా దొంగ ఓట్లతో గెలిచిందని రాహుల్‌గాంధీ ఆధారాలతో చూపించారు. రాష్ట్రంలోనూ ఆ పార్టీకి చెందిన 8 మంది ఎంపీలు ఇలాగే గెలిచి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారత రాష్ట్ర సమితిలో మూడు ముక్కలాట ముగిసింది. ఇదే అదనుగా నాలుగో ముక్కగా ఒక నేత అవకాశం కోసం చూస్తున్నారు' అంటూ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. 'సామాజిక న్యాయమే మా ప్రభుత్వ ధ్యేయం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ బిహార్‌లో యాత్ర చేపడుతున్నారు. ప్రజల కష్ట సుఖాలను, ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకే మేం ఈ యాత్ర నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారు' అని అన్నారు. అంతకుముందు నేతలంతా కలిసి దాదాపు 6 కి.మీ మేర పాదయాత్ర చేశారు. కురిక్యాలలో పలువురు మహిళలను పార్టీ నేతలు పలకరించారు. ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. యాత్రలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకట్‌స్వామి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, జీవన్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశంలో భారత్‌కు అభేద్య కవచం.. డీఆర్‌డీవో మరో ఘన విజయం

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) తన అమ్ముల పొదిలో మరో శక్తిమంతమైన అ స్త్రాన్ని చేర్చింది. దేశ రక్షణ సామ ర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చే క్రమంలో శనివారం ఒడిశా తీరం లో ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూఎస్) తొలి ప్రయోగ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించారు. ఈ చారిత్రాత్మక విజయంపై డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, భారత సాయుధ దళాలను, పారిశ్రామిక వర్గాలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. "ఐఏడీడబ్ల్యూఎస్ విజయవంతమైన అభివృద్ధికి కృషి చేసిన డీఆర్‌డీవో, సాయుధ దళాలు, పరిశ్రమలకు నా అభినందనలు. ఈ ప్రత్యేకమైన ప్రయోగ పరీక్ష మన దేశ బహుళస్థాయి గగనతల రక్షణ సామర్థ్యాన్ని రుజువు చేసింది. శత్రువుల వైమానిక దాడుల నుంచి దేశంలోని కీలక ప్రాంతాలకు, ముఖ్యమైన సంస్థలకు ఇది మరింత పటిష్ఠమైన రక్షణ కల్పిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూఎస్) అనేది ఒకే వ్యవస్థ కాదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బహుళస్థాయి రక్షణ వ్యవస్థ. ఇందులో క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (క్యూఆర్‌శామ్), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వీషోరాడ్స్) క్షిపణులతో పాటు అధిక శక్తివంతమైన లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ) కూడా ఉన్నాయి. ఈ వ్యవస్థలన్నీ కలిసి భారత గగనతలానికి ఒక అభేద్యమైన రక్షణ కవచంగా పనిచేస్తాయని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే తక్షణమే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికలను ఎదుర్కొని గెలవాలని ఆయన సవాల్ విసిరారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొని ఉప ఎన్నికలకు రావాలని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో ఓటమి భయం మొదలైందని కేటీఆర్ అన్నారు. అందుకే వారు రాజీనామా చేసేందుకు వెనుకాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే 'హైడ్రా' వ్యవస్థ పనిచేస్తోందని, దాని ఆగడాల వల్ల ఒకప్పుడు దేశానికే తలమానికంగా ఉన్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు కంటే, రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల కాలంలోనే ఎక్కువ అప్పులు చేశారని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని కేటీఆర్ నిలదీశారు. గతంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిందని కేటీఆర్ గుర్తుచేశారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నప్పటికీ, కేసీఆర్ నాయకత్వంలో ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. దీంతో నగరంలో ఇన్వర్టర్లు, జనరేటర్ల అవసరమే లేకుండా పోయిందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయకుండా హైదరాబాద్‌ను అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా అభివృద్ధి చేశామని చెప్పారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ పండుగలకు సమ ప్రాధాన్యత ఇస్తూ మతసామరస్యాన్ని కాపాడామని అన్నారు. అందుకే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా గులాబీ జెండాకే పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యేతో సహా పార్టీ మారిన వారంతా ప్రజల కోసం కాదని, కేవలం తమ స్వార్థ ప్రయోజనాలు, ఆర్థిక లాభాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే, ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి చూపించాలని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం టైంపాస్ మాటలు చెబుతూ, కేసీఆర్‌పైన, తనపైన కేసులు పెడతామని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు పార్టీని మోసం చేసి వెళ్లినా, బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం

- మొదటి పేజి తరువాయి

కార్మికుల విషయంలో నిర్మాతలు మానవత్వంతో వ్యవహరించాలి. కార్మికులను కూడా పిలిచి మాట్లాడతాను. నిర్మాతలు, కార్మికులు, ప్రభుత్వం కలిసి ఒక విధానం తీసుకొస్తే బాగుంటుంది. కార్మికులను, నిర్మాతలను మా ప్రభుత్వం కాపాడుకుంటుంది.

**వ్యవస్థలను నియంత్రిస్తామంటే సహించం..**

సినిమా పరిశ్రమకు పర్యవేక్షణ అవసరం. ఈ రంగానికి ఏమేం కావాలో కొత్త పుస్తకం రాసుకుందాం. వ్యవస్థలను నియంత్రిస్తామంటే ప్రభుత్వం సహించదు. అందరూ చట్టం పరిధిలో పనిచేయాల్సిందే. పరిశ్రమ విషయంలో న్యూట్రల్‌గా ఉంటాను. హైదరాబాద్‌లో అంతర్జాతీయ సినిమాల చిత్రీకరణ కూడా జరుగుతోంది. తెలుగు సినిమాల చిత్రీకరణ ఎక్కువగా రాష్ట్రంలోనే జరిగేలా చూడాలి. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా పరిశ్రమను ఉంచడమే నా ధ్యేయం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్‌బాబు, జెమిని కిరణ్, స్రవంతి రవికిశోర్, నవీన్ ఎర్నేని, వంశీ, బాపినీడు, డీవీవీ దానయ్య, చెరుకూరి సుధాకర్, సాహు, అభిషేక్, విశ్వప్రసాద్, అనిల్, శరత్, ఎన్వీ ప్రసాద్, ఎస్‌కేఎన్, రాధామోహన్, దాము, దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, బోయపాటి శ్రీను, సందీప్‌రెడ్డి, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరులో బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ప్రమాణ స్వీకార కార్యక్రమం.

● బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని నాయకుల వెల్లడి.



సి కె న్యూస్ ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 24,కర్నూలు జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్ నందు ఆదివారం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు వెంకటరామరాజు, బిజెపి నాయకులు అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్, రాష్ట్ర కార్యదర్శి దేశాయ్ కృష్ణమూర్తితో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. అనంతరం పలువురు బ్రాహ్మణులతో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బిజెపి నాయకులు గురురాజ్ దేశాయ్ మాట్లాడుతూ, జిల్లాలోను, నియోజకవర్గాల్లోను బ్రాహ్మణులకు కమిటీలు ఏర్పాటు చేసి బ్రాహ్మణులను ఐక్యతగా తీసుకువస్తామని తెలిపారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, వారి అభివృద్ధి కోసం పోరాటాలు చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో బ్రాహ్మణులకు ఇచ్చిన 11 అంశాలలో ఇప్పటివరకు మూడు మాత్రమే నెరవేర్చారని, మిగిలిన తొమ్మిది అంశాలను కూడా త్వరగా పూర్తి చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా, "అపకరణ భవనం", "కమ్యూనిటీ హాల్స్", "స్మశానం" వాటిక వాటికీ వెంటనే నిధులు కేటాయించి నిర్మాణాలు చేపట్టాలని కర్నూలు జిల్లా బ్రాహ్మణ కమిటీ సభ్యుల తరఫున వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం నిధులు కేటాయించి కమ్యూనిటీ హాల్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గురురాజ్ దేశాయ్ ఎకగ్రీవంగా ఎన్నికయిన జిల్లా కార్యవర్గ సభ్యులకు సర్టిఫికెట్ లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర ముక్య కార్యదర్సులు, బ్రహ్మణ యువ నాయకులు ఎమ్మిగనూరు నియొజకవర్గ బ్రహ్మణులు పాల్గోన్నారు.

# పార్థివ దేహానికి నివాళులర్పించిన మాజీ ఎంపీపీ సర్పంచ్



సి కె న్యూస్ :గూడూర్ మండలంలోని రాములు తండా గ్రామపంచాయతీ పరిదిలోని బానోత్ తండా కు చెందిన బానోత్ కమ్లీ అనారోగ్యంతో మరణించగా అక్కడికి వెళ్ళి పార్థివ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన గూడూరు మాజీ ఎంపీపీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్ వారితోపాటు రాములు తండా మాజీ సర్పంచ్ గుగులోతు సుగుణ లక్ష్మణ్ నాయక్ గూడూరు మాజీ వార్డు సభ్యుడు హెచ్ శివ నూనావత్ శ్రీకాంత్ పీరియ విజయ్ తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయకుడును పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం

● డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేసిన సిఐ శ్రీనివాసులు



ఎమ్మిగనూరు టౌన్, సి కె న్యూస్ ఎమ్మిగనూరు పట్టణంలో వినాయక పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడుదామని ఎమ్మిగనూరు పట్టణ సిఐ శ్రీనివాసులు అన్నారు.ఆదివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ లో భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) మాజీ జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్లను సీఐ శ్రీనివాసులు విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు ను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ లు వడ్డే శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి తో పాటు డీవైఎఫ్ఐ నాయకులు రవి కుమార్,అజిత్, రాకేష్ పాల్గొన్నారు.

# కె.తిమ్మాపురం గ్రామంలో వైసీపీ నాయకులు బోయ పరమేష్ ను పరామర్శించిన..

● వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక.
● పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ.





ఎమ్మిగనూరు గ్రామీణ, సి కె న్యూస్ ఎమ్మిగనూరు మండల పరిధిలోని కె తిమ్మాపురం గ్రామంలో వైఎస్ఆర్సిపి నాయకులు బోయ పరమేష్ ను వారి స్వగృహం నందు ఆదివారం ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక,పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ లు బోయ పరమేష్ తల్లి లక్ష్మమ్మ అకాల మరణం చెందిన విషయం తెలిసి బోయ పరమేష్ ను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మండలం యువజన విభాగం అధ్యక్షులు బనవాసి బసిరెడ్డి, ఎమ్మిగనూరు మండల కార్యవర్గ సభ్యులు బజారి, తిమ్మాపురం గ్రామ మాజీ విద్య కమిటీ చైర్మన్ డాక్టర్ వీరాంజనేయులు, గౌడ్స్ సగం జిల్లా కార్యదర్శి ఉరుకుందు గౌడ్, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, నాయకులు వెంకట్ రాముడు, కె వెంకటేష్,ఎం.మల్లికార్జున, చెన్నప్ప ,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షం నీరు చేరిన గుంత మగ్గాల చేనేత కార్మికులను ఆదుకోవాలి.

**చేనేతల ఇబ్బందులను తెలుసుకున్న బుట్టా రేణుక**

ఎమ్మిగనూరు టౌన్,సి కె న్యూస్ ఆగస్టు 24,ఎమ్మిగనూరు పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన చేనేతల కుటుంబాలను ఎమ్మిగనూరు వైసిపి ఇంచార్జి బుట్టా రేణుక, బుట్టా నీలకంఠప్ప లు కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు.ఆదివారం స్థానిక శివన్న నగర్,లక్ష్మి పేట,ముగతి పేట, సోమప్ప నగర్ లో చేనేత కుటుంబాల ఇంటికి వెళ్లి గుంతల మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ వర్షానికి గుంతల మగ్గాల లో నీరు చేరి పని చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది.ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం తరుపున ఎవరు వెళ్లలేదు. దీంతో ముడి సరుకు తడిచిపోయి పనులు లేక నష్టపోయిన చేనేతల ను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చేనేతల గుంతల మగ్గాలకు కు 200 యూనిట్లు ,పవర్ లూమ్స్ మగ్గాలకు 500 యూనిట్లు కరెంటును ఉచితంగా ఇవ్వాలి.అలాగే ఏడాదికి 25 వేల రూపాయలు ఇవ్వాలి. వైసిపి ప్రభుత్వం లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేనేత నేస్తం కింద 24 వేల రూపాయలు ఇచ్చేవారు.100 యూనిట్లు కరెంటును ఉచితంగా ఇచ్చేవారు.కరోనా సమయంలో కూడా చేనేతలను అదుకున్నాం. వాలంటరీ వ్యవస్థ,సచివాలయ సిబ్బంది చేనేతల ఇంటికి వెళ్లి కస్టానస్తాన్ని తెలుసుకొని పరిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు,బోయ బజారి, ఖాసీం బెగ్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్,చేనేత మల్లికార్జున,కౌన్సిలర్ అంపమ్మ,మీసాల నీలకంఠ, కదిరికోట సునీల్ కుమార్,చంద్ర శేఖర్,బోయ రాజు,కోటకొండ నరసింహులు,లతా రెడ్డి,నాగేంద్ర,హర్ష,రఘునాత్, మోనే శ్రీరాములు,బుట్టా ఈరన్న,ఇబ్రహీం, గిరి,బోయ సోమేష్,బోయ పామయ్య,జేరుబండి రఘువీర్, ఎల్ఐసీ ప్రభాకర్,ఉస్మాన్,ఘోర నబీ, సోమేష్ పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి



గూడూరు సి కె న్యూస్ గూడూరు మండల పరిధిలోని శివాలయం వీధిలో తాడెం రాములు గొల్లగూడెంలో అడ్డూరి మానసలకు ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్ వారితోపాటు గూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ చంటి స్వామి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు రసమల యాకయ్య జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి ఎండి రసూల్ ప్రచార కమిటీ అధ్యక్షులు ఎలమందల శ్రీనివాస్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాస మల్ల రాములు గూడూరు మండల కాంగ్రెస్ నాయకులు తంగళ్ళపల్లి సునీల్ లైన్ తండా గ్రామ పార్టీ అధ్యక్షులు మాన్సింగ్ మండల్ రామచంద్రు మటన్ కుమార్ డ్రైవర్ సాంబయ్య యూత్ కాంగ్రెస్ నాయకులు హెచ్ మనోజ్ మండల నాయకులు నాగేలి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్..

**వల్మీడి గ్రామంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ మానవతా సేవలు.**

పాలకుర్తి సి కె న్యూస్ జనగామ జిల్లా: పాలకుర్తి మండలం,వల్మీడీ గ్రామానికి చెందిన తండ రాములమ్మ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి అమ్మచారిటబుల్ ట్రస్ట్ నుండి 25 కేజీల బియ్యం,కూరగాయలు,నిత్యావసరాలు అందజేయడం జరిగింది.రాపాక స్వాతి నాగరాజు జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమానికి సహకరించినందుకు వారికి ట్రస్ట్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్,కోశాధికారి ఒర్రె కుమారస్వామి,మృతుడి కుటుంబసభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



# అవాజ్ నూతన కమిటీ ఎన్నిక








పెబ్బేర్: సి కె న్యూస్ పెబ్బేరు మున్సిపల్ కేంద్రలోని అవాస్ మండల నూతన కమిటీని ఆదివారం అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి,జబ్బార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునికిగా అబ్దుల్ ఉసేన్,ఉపాధ్యక్షులుగా నిజాం,అర్బాబ్,ప్రధాన కార్యదర్శిగా మెయిన్,సహాయ కార్యదర్శులుగా షకీల్,ఉసేన్ బాషా, కోశాధికారిగా నసీరొద్దీన్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ అవాజ్ కమి ఈ కార్యక్రమంలో అతీక్ ఉల్ రహేమాన్, ఎండి ఖాజా, రహమతుల్లా, అప్సర్, ఉమర్, ఇబ్రహీం, మైనుద్దీన్, మజీద్, అఫ్రోజ్, నాజియా కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌ను దూరం చేసుకోవడం అమెరికాకు చేటు!

అమెరికా మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ, రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ చేసిన వ్యాఖ్యలు భారత్–అమెరికా సంబంధాల ప్రాముఖ్యతను మరింతగా ఎత్తిచూపాయి. భారత్ లాంటి వ్యూహాత్మక మిత్రదేశాన్ని అమెరికా దూరం చేసుకోవడం సరికాదని వారు హెచ్చరించారు. జాన్ కెర్రీ తాజాగా మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దౌత్యంలో సహకారం కంటే ఆదేశాలు, ఒత్తిడి ఎక్కువ చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. భారత్, అమెరికా వంటి మహా దేశాలు ప్రజలకు అల్టిమేటంలు ఇవ్వడం ద్వారా కాదు, పరస్పర గౌరవంతో, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి. ఒబామా పాలనలో సహకారం ప్రధానంగా ఉండేది. కానీ ఇప్పుడు విభేదాలు పెరుగుతున్నాయి" అని వ్యాఖ్యానించారు.

**నిక్కీ హేలీ సూచన**

రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ట్రంప్ చేసిన అభ్యంతరాలను భారత్ సీరియస్‌గా తీసుకోవాలని నిక్కీ హేలీ సూచించారు. "అమెరికా–భారత్ మధ్య ఉన్న దశాబ్దాల స్నేహం, విశ్వాసం ఇలాంటి ఒడిదుడుకులను అధిగమించే బలమైన పునాది. వాణిజ్యం, చమురు వంటి అంశాల్లో బలమైన చర్చలు జరగాలి. చైనాను ఎదుర్కోవడంలో అమెరికాకు భారత్ మిత్రుడిగా ఉండటం అత్యంత కీలకం" అని ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ. యువ జనాభాతో భవిష్యత్తులో చైనాను అధిగమించగలదు. ఇలాంటి మిత్రదేశాన్ని ఆంక్షలతో, ఒత్తిడితో దూరం చేసుకోవడం అమెరికాకు విపత్కరం అవుతుంది" అని వ్యాఖ్యానించారు.

**ట్రంప్ వైఖరిపై విమర్శలు**





రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులపై అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. "ఈ చమురు సొమ్ము ఉక్రెయిన్ యుద్ధానికి ఉపయోగపడుతోందని" ట్రంప్ సలహాదారు పీటర్ నవారో ఆరోపించారు. అంతేకాక భారత్ దిగుమతులపై ట్రంప్ 25 శాతం పెనాల్టీలు విధించడం ఉద్రిక్తతలకు దారి తీసింది. దీనిపై భారత వాదన ఏమిటంటే చమురు ధరలు పెరిగితే 150 కోట్ల మంది ప్రజలపై భారం పడుతుంది. తమ అవసరాల కోసం చమురు కొనుగోలు చేయడం తప్పు కాదని న్యూఢిల్లీ స్పష్టం చేస్తోంది. భారత్–అమెరికా సంబంధాలు కేవలం వ్యాపార, వాణిజ్య అంశాలకే పరిమితం కావు. ఇవి వ్యూహాత్మక భాగస్వామ్యం, భద్రతా సహకారం, ప్రజాస్వామ్య విలువలపై ఆధారపడి ఉన్నాయి. ఇలాంటి సమయంలో ట్రంప్ విధానాలు ఉద్రిక్తతలకు దారితీస్తే, చైనాకు మాత్రమే లాభం చేకూరుతుంది. భారత్‌ను మిత్రదేశంగా నిలుపుకోవడం అమెరికాకు కూడా అత్యంత అవసరం అని నిపుణులు ఏకాభిప్రాయంతో చెబుతున్నారు.

# ఈసీకి షాక్: బీహార్‌లో ఇద్దరు పాక్ పౌరులకు ఓటు హక్కు!




కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు నిప్పులు చెరు గుతున్న విషయం తెలిసిందే. బతికి ఉన్నవారి ఓట్లు తీసేస్తున్నారని, చచ్చిపోయిన వారి ఓట్లు ఉంచుతు న్నారని.. ఒకే వ్యక్తికి నాలుగు చోట్ల ఎన్నికల గుర్తింపు కార్డులు ఇచ్చారని, %–%జీరో%–% డోర్ నెంబరుతో వేలాది ఓట్లు ఇచ్చారని ఇలా.. అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ఇండియా కూటమి ఆరోపిస్తోంది. అంతేకాదు.. బీహార్‌లో అయితే.. 65 లక్షల ఓట్లను తొలగించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెద్ద ఉద్యమమే చేస్తున్నారు. %–%ఓట్ అధికార్ యాత్ర%–% పేరుతో 13 వేల కిలో మీటర్లు, 22 జిల్లాల్లో కవర్ చేసేలా యాత్రను ప్రస్తుతం కొనసా గిస్తున్నారు. ఓట్లను చోరీ చేస్తున్నారని, తమకు అనుకూలంగా ఉన్నవారిని చేరుస్తూ.. కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పార్టీలకు అనుకూలంగా ఉన్నారని భావిస్తున్న ఓటర్లను తొలగిస్తున్నారని రాహుల్‌గాం ధీ సహా ఇతర పక్షాల నాయకులు నిప్పులు చెరుగుతున్నారు. అయితే.. దీనికి సమాధానం చెప్పని ఎన్నిక ల సంఘం.. ఎదురు ఆరోపణలు సంధించింది.. అఫిడవిట్లు కోరింది. కుదరకపోతే.. క్షమాపణలు చెప్పాలని కూడా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా బీహార్‌లో సంచలన విషయం వెలుగు చూసింది.

ఇద్దరు పాకిస్థాన్ పౌరులకు ఇక్కడ ఓటు హక్కు కల్పించారు. పోనీ.. వారేమన్నా.. పాక్ వదిలేసి వచ్చి ఉంటున్నారా? అంటే.. లేదు. ఒకరు 3 మాసాల వీసాపై 1956లో వచ్చి దొంగచాటుగా ఇక్కడే ఉంటున్నారు. మరొకరు మూడేళ్ల వీసాపై వైద్యం కోసం ఇటీవల వచ్చారు. కానీ, వీరి వివరాలు పరిశీలించకుండానే గుడ్డిగా ఎన్నికల సంఘం వీరికి ఓటు హక్కు కల్పించింది. తాజాగా ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వెలుగు చూడగానే కేంద్ర హోం శాఖ హుటాహుటిన స్పందించింది.

**ఏం జరిగింది?**

పాకిస్థాన్‌కు చెందిన మహిళలు.. ఇమ్రానా ఖానమ్ అలియాస్ ఇమ్రానా ఖాటూన్, మరొకరు ఫిర్దోషియా ఖానమ్ అనే మహిళలకు తాజాగా ఓటరు కార్డులు ఇచ్చారు. వీటిపై చుట్టుపక్కలవారికి అనుమానం వచ్చి.. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

ఇవి జోరుగా వైరల్ అయ్యాయి. వెంటనే స్పందించిన కేంద్ర హోంశాఖ విచారణ చేపట్టింది. ఫిర్దోషియా 1956లో మూడు నెలల వీసాపై, ఇమ్రానా మూడేళ్ల వీసాపై భారత్‌కు వచ్చి..భాగల్పూర్ జిల్లాలోని భికన్‌పూర్‌లో స్థిరపడ్డారని గుర్తించింది. వెంటనే వీరి ఓట్లను తొలగించాలని ఆదేశించింది. దీనిపై ఎన్నికల సంఘం ఎప్పటిలానే మౌనంగా ఉండిపోయింది.

# కన్నీళ్లు పెట్టిన కిమ్: రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో అరుదైన సంఘటన

ప్రపంచంలోని అత్యంత కఠినమైన నియంతలలో ఒకరైన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ సైనికుల మరణంపై తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. బహిరంగంగానే కన్నీళ్లు పెట్టుకుని, అమరవీరుల కుటుంబాలను ఓదార్చడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఈ సంఘటన కిమ్‌లో ఒక మానవీయ కోణాన్ని ప్రపంచానికి చూపించింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతున్న ఉత్తర కొరియా సైనికుల మృతదేహాలకు నిర్వహించిన సైనిక గౌరవ సత్కార కార్యక్రమంలో ఈ అరుదైన దృశ్యం కనిపించింది.

**సైనికుల త్యాగానికి కిమ్ జోంగ్ ఉన్ కన్నీళ్లు**

రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో తమ దేశానికి మద్దతుగా ఉత్తర కొరియా వేలాది మంది సైనికులను పంపినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ సైనికులలో వందలాది మంది ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఇటీవల, మరణించిన సైనికుల మృతదేహాలను ప్రత్యేక విమానాల ద్వారా ఉత్తర కొరియాకు తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో కిమ్ జోంగ్ ఉన్ పాల్గొన్నారు. అమరవీరుల చిత్రాల ముందు మోకాళ్లపై కూర్చుని పతకాలను ఉంచి ఆయన బోరున విలపించారు. ఒక అమరవీరుడి చిన్నారి కుమార్తె నుదిటిపై ముద్దు పెట్టి, ఆమెను ఓదార్చడం అక్కడ ఉన్నవారందరినీ కదిలించింది.

**కఠినమైన నియంతలో మానవీయ కోణం**

కిమ్ జోంగ్ ఉన్ తన క్రూరమైన పాలనకు, కనికరం లేని శిక్షలకు పేరుగాంచారు. గతంలో ఆయన తన



ప్రత్యర్థులను, కుటుంబ సభ్యులను కూడా బహిరంగంగా ఉరితీయించిన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి కఠినమైన నియంత బహిరంగంగా కన్నీళ్లు పెట్టుకోవడం చాలా అరుదు. గతంలో ఆయన దేశంలో జననాల రేటు తగ్గుదల గురించి ప్రసంగిస్తున్నప్పుడు, తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణించినప్పుడు కూడా కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి సైనికుల మరణంపై ఆయన చూపిన భావోద్వేగం, వారి కుటుంబాలను ఓదార్చడం, ఆయనలో ఒక మానవీయ కోణాన్ని ప్రదర్శించింది. ఇది అంతర్జాతీయంగా విస్తృత చర్చకు దారితీసింది.

**బలపడుతున్న రష్యా–ఉత్తర కొరియా బంధం**

ఈ సంఘటన రష్యా, ఉత్తర కొరియా మధ్య బలపడుతున్న స్నేహాన్ని కూడా స్పష్టం చేస్తుంది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు ఆయుధాలు, సైనికులను పంపించడం ద్వారా కిమ్ జోంగ్ ఉన్ రష్యాకు తన నిబద్ధతను ప్రదర్శించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ఉత్తర కొరియా సైనికులను 'హీరోలు'గా అభివర్ణించారు. రష్యా, ఉత్తర కొరియా మధ్య రక్షణ ఒప్పందాలు మరింత బలపడటానికి ఈ సంఘటన ఒక నిదర్శనంగా మారింది. ఈ కన్నీళ్లు ఒక నిజమైన భావోద్వేగమా లేక రాజకీయ వ్యూహమా అనే చర్చలు నడుస్తున్నప్పటికీ, కిమ్ జోంగ్ ఉన్ తీసుకున్న ఈ అసాధారణ చర్య ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

# జగన్ రూటే సపరేటు.. మరోసారి కీలక నిర్ణయాలతో రూట్ పైకి ప్రతిపక్ష నేత



ఆంధ్రప్రదేశ్ రాజకీయ పటంలో మార్పులు మొదలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం వైసీపీని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలను అమలు చేస్తోంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జగన్ పార్టీ ఎన్డీయే అభ్యర్థికి మద్దతిస్తుండడంతో కొత్త లెక్కలు ప్రారంభమయ్యాయి. కూటమిలో ఉన్న మూడు పార్టీలు దేనికదే పార్టీ కేడర్ ను స్ట్రాంగ్ చేసుకునేందుకు ప్రణాళికలు వేస్తుంది. ఈ నేపథ్యంలో రానున్న అసెంబ్లీ సమావేశాలకు జగన్ తీసుకున్న నిర్ణయం ఆసక్తి రేకెత్తిస్తోంది.

**సెప్టెంబర్ 17 నుంచి సభ..!**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష హోదాలో ఉండేందుకు జగన్ సమ్మతించలేదు. సీట్ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నాయి కాబట్టి ప్రధాన ప్రతిపక్ష హోదా ఆయన పార్టీకి దక్కలేదు. కానీ ఇటీవల తనకు ప్రధాన ప్రతిపక్ష హోదా కావాలని డిమాండ్ చేశారు. అది ఇస్తేనే వస్తానని రావడం లేదు. పార్టీ పెద్ద అసెంబ్లీకి రాకుంటే తాము వెళ్లి సాధించేదేంటని పార్టీకి చెందిన మిగతా ఎమ్మెల్యేలు రావడం లేదు. వర్షాకాలం సమావేశాలు సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం సూత్ర ప్రాయంగా చెప్తోంది. అసెంబ్లీ సమావేశాలపై సెప్టెంబర్ 4వ తేదీ కేబినెట్ సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.


**ఈ సారి జగన్ హాజరవుతారా..?**

రాష్ట్ర ప్రజలు, పార్టీ కేడర్ కోరిక మేరకు జగన్ కూడా హాజరవుతానని పార్టీ కేడర్ నుంచి సమాచారం అందుతోంది. ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేసి 15 నెలలు కావడంతో ప్రభుత్వ వైఫల్యాలను సభలో ప్రస్తావించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. 15 నెలలుగా తనపై వస్తున్న ఆరోపణలను ఈ సమావేశాలకు హాజరై ఖండించాలని మాజీ సీఎం అనుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే అమరావతి విషయంలో కూడా జగన్ యూ టర్న్ తీసుకున్నట్లు పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. మూడు రాజధానులకు ప్రజా మద్దతు లేకపోవడంతో ఆలోచనను మార్చుకున్నట్లు చెప్తున్నారు.

**ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు జగన్ సిద్ధం అయ్యారా..?**

ప్రభుత్వం కూడా ఎవరైనా ప్రతిపక్ష నేతకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలని యోచిస్తోంది. రాజధాని నిర్మాణం, భూ సేకరణ, తదితర విషయాలను ప్రజలకు ఎలా వివరించాలన్నదానిపై ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇక జగన్ రాజధానిలోని లోపాలతో పాటు లిక్కర్ కేసులో అరెస్ట్ లాంటి విషయాలను ప్రధానంగా మాట్లాడుతారని తెలుస్తోంది. ఏది ఏమైనా జగన్ యూ టర్న్ తీసుకున్నాడా..? దీంతో ప్రజలకు దగ్గరవ్వనున్నాడా..? అన్న సందేహాలు వినిపిస్తున్నాయి.

# జ్ఞానానికే అంకితమైన జీవితం..



కర్ణాటక రాష్ట్రం శ్రీరంగపట్టణం తాలూకా హరళహల్లిలో ఒక ప్రత్యేకమైన ఇల్లు ఉంది. సాధారణంగా అది ఇల్లు మాత్రమే కాదు, లక్షలాది పుస్తకాలతో నిండిన జ్ఞాన భాండాగారం. పరిశోధకులు, రచయితలు, ఉపాధ్యాయులు, విమర్శకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు ఎప్పుడూ కిటకిటలాడే ఈ స్థలం.. నిజంగా ఒక సజీవ విశ్వవిద్యాలయంలా అనిపిస్తుంది.

ఇక్కడ నవలలు, సాహిత్యం, పురాణాలు, విజ్ఞానం, టెక్నాలజీ, సినిమాలు, క్రీడలు ఇలా ఏ రంగమైనా పుస్తకం లభిస్తుంది. 8 విదేశీ భాషల్లోనూ, 22 భారతీయ భాషల్లోనూ సుమారు 15 లక్షల పుస్తకాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. ఈ మహా సంపదను సేకరించింది ఒక్కరే మండ్య జిల్లా కెన్నాళ్లు గ్రామానికి చెందిన అంకేగౌడ (76).

**పుస్తకాలపై పుట్టిన మక్కువ**

కాలేజీ రోజుల్లో పుస్తకాలు సులభంగా దొరకకపోవడంతో, "నాకు సొంతంగా పుస్తకాలు ఉండాలి" అనే ఆలోచన అంకేగౌడలో చిగురించింది. ఆ చిన్న కోరిక క్రమంగా అతని జీవిత లక్ష్యమైంది. 21 ఏళ్ల వయసులో మొదలైన ఈ పుస్తకాల సేకరణ, ఇప్పుడు ఐదు దశాబ్దాల మహాయజ్ఞంగా మారింది.

**కష్టాల్లోనూ పుస్తకాల కోసం కృషి**

మండ్య చక్కెర పరిశ్రమలో 30 ఏళ్లు కార్మికుడిగా పనిచేసిన అంకేగౌడ, తన జీతంలో 80 శాతం పుస్తకాలకే ఖర్చు పెట్టేవారు. కొందరు దాతలు, పాఠకులు కూడా సహాయం చేస్తూ తమ వద్ద ఉన్న పుస్తకాలను ఇస్తుంటారు. అయినప్పటికీ, ఈ ప్రైవేట్ గ్రంథాలయం నడవడానికి సహాయకులను పెట్టుకునే స్థోమత లేకపోవడంతో, కుటుంబ సభ్యులే నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

**పుస్తకాల ఇల్లు - ప్రజల గ్రంథాలయం**

ప్రతిరోజూ స్వయంగా పుస్తకాలను శుభ్రం చేయడం, సక్రమంగా పేర్చడం %–% ఇవన్నీ అంకేగౌడే చేస్తారు. పాఠకుల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, తన ఇల్లు జ్ఞానాన్ని పంచే గృహమయ్యేలా చూసుకుంటున్నారు. సమాజంలో చాలా మంది తమ సొంత ఆస్తులు, భవనాలు సేకరించడానికి జీవితాన్ని అర్పిస్తారు. కానీ అంకేగౌడ మాత్రం పుస్తకాలకే జీవితాన్ని అంకితం చేశారు. ఆయన కృషి వల్ల హరళహల్లిలోని ఈ పుస్తకాల ఇల్లు, పుస్తక ప్రియులకు ఒక ఆశ్రయం, పరిశోధకులకు ఒక ఆభరణం, తెలుగు సహా అనేక భాషల అభ్యాసకులకు ఒక వరం అయింది.

## విశాఖ సభ జనసేన భవిష్యత్తు వ్యూహాలకు నాంది కాబోతున్నదా ?



ప్రస్తుతం జనసేన, తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ కలిసి అధికారంలో ఉన్నప్పటికీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన ప్రత్యేక రాజకీయ గుర్తింపును నిలుపుకోవాలనే ఆలోచనలో ఉన్నారనే తెలుస్తున్నది. కొంతమంది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం కూడా ఇదే. 2029 ఎన్నికల సమీకరణలను దృష్టిలో పెట్టుకుని, జనసేన తన వ్యూహాలను ఎటువంటి మార్పులు చేస్తుందో అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. అయితే ఆ ప్రశ్నకు సమాధానం మరో వారంలో దొరకవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**15 వేల మంది జన సైనికులు..**

ఆగస్టు 30న విశాఖ నగరంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మహాసభ నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 15 వేల మంది జనసైనికులు, వీరమహిళలు తరలిరానున్నారు. పవన్ పుట్టినరోజు వేడుకలతో పాటు ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీయనుంది.

**దిశానిర్దేశం చేయబోతున్నారా?**

ఈ మహాసభలో ప్రధానంగా పార్టీ భవిష్యత్ దిశపై పవన్ కల్యాణ్ ఎలాంటి సందేశం ఇస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది. ఆయన ప్రత్యేకంగా 12 కమిటీలను ఏర్పాటు చేసి, అన్ని ఏర్పాట్లు పర్యవేక్షణలో పెట్టడం ద్వారా ఈ సమావేశానికి ఇచ్చే ప్రాధాన్యత స్పష్టమవుతోంది. కాగా, జన సైనికులు మాత్రం, ఈ సభ ద్వారా పార్టీ కొత్త పంథాలో అడుగులు వేస్తుందా? లేక ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతుందా? అన్న సందేహాలపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నారు. ఇక పవన్ కల్యాణ్‌కు ఉన్న సినీ క్రేజ్ కూడా ఈ సభకు మరింత ప్రాధాన్యం చేకూర్చుతున్నది. గ్యాంగ్ స్టర్ రోల్ లో ఆయన నటించిన ఓజీ చిత్రం విడుదలకు ముందే ఈ సభ జరగడం, ఇది రాజకీయంగా మాత్రమే కాకుండా సినీ వర్గాల్లో కూడా చర్చకు దారితీస్తున్నది. అభిమానులలో ఒక వర్గం ఆయన నుంచి ఊహించి సర్‌ప్రైజ్ ఉంటుందని భావిస్తున్నది.

మొత్తం మీద, ఈ విశాఖ మహాసభ పవన్ కల్యాణ్ వ్యక్తిగత పుట్టినరోజు వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో వచ్చే దశాబ్దానికి దిశా నిర్ధేశం చేసే వేదికగా నిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

## దుడుమా జలపాతం విషాదం: ప్రాణాలను బలిగొన్న రీల్స్ మోజు



కొన్నిసార్లు సరదాగా మొదలైన పనులు తీరని విషాదాన్ని మిగులుస్తాయి. ఇటీవల ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో ఉన్న ప్రసిద్ధ దుడుమా జలపాతం వద్ద జరిగిన విషాదకర సంఘటన కూడా అలాంటిదే. కేవలం కొన్ని వ్యూస్, లైకుల కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఒక యువ యూట్యూబర్ విషాదాంతం చెందాడు.

**ఏం జరిగింది?**

ఒడిశా రాష్ట్రంలోని సుంకి ప్రాంతానికి చెందిన ప్రముఖ యూట్యూబర్ సగర్, తన స్నేహితులతో కలిసి దుడుమా జలపాతాన్ని సందర్శించాడు. సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్ కోసం ఒక ఆసక్తికరమైన వీడియో లేదా రీల్స్ తీయాలనే ఉద్దేశంతో అతను జలపాతం మధ్యలో ఉన్న ఒక బండరాయిపైకి వెళ్ళాడు. చూడటానికి చాలా ప్రమాదకరంగా కనిపించే ఆ ప్రదేశంలో, అతను జాగ్రత్తగా నిలబడి వీడియో చిత్రీకరణ మొదలుపెట్టాడు. అయితే, విధి వక్రించింది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న జలపాతం ఒక్కసారిగా ఉధృతమైంది. పైన కురిసిన వర్షాల వల్ల నీటి ప్రవాహం అకస్మాత్తుగా పెరిగింది. ఈ అనూహ్య ప్రవాహంలో సగర్ తన సమతుల్యం కోల్పోయి జారిపడిపోయాడు. ఆ సమయంలో అతడి స్నేహితులు, అక్కడున్న పర్యాటకులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కళ్లముందే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన సగర్‌ను రక్షించలేక వారంతా నిస్సహాయంగా ఉండిపోయారు.

**గాలింపు చర్యలు.. దొరకని ఆచూకీ**

ఈ సంఘటనతో అక్కడున్న వారంతా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే పోలీసులకు, రెస్క్యూ టీమ్‌లకు సమాచారం అందించారు. అగ్నిమాపక, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని, గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఆ ప్రాంతం చాలా లోతుగా ఉండటం, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలు కష్టంగా మారాయి. అధికారులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ, సగర్ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

**సోషల్ మీడియాలో చర్చ**

ఈ విషాదకర సంఘటన గురించి తెలిసిన తర్వాత, సోషల్ మీడియాలో తీవ్ర చర్చ మొదలైంది. నెటిజన్లు, ఇతర కంటెంట్ క్రియేటర్లు ఈ ఘటనపై తమ స్పందనలు తెలియజేశారు. చాలామంది ప్రాణాల కంటే కంటెంట్ గొప్పది కాదని, లైకుల కోసం ప్రాణాలను పణంగా పెట్టడం అవివేకమని అభిప్రాయపడ్డారు."కేవలం కొన్ని లైకుల కోసం ఇలా ప్రాణాలను పోగొట్టుకోవడం చాలా బాధాకరం. యువత ఇలాంటి ప్రమాదకర ప్రదేశాల్లో వీడియోలు చేయడం మానుకోవాలి." "ప్రాణాలు అమూల్యమైనవి. కంటెంట్ క్రియేటర్లు తమ సురక్షితకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటివి మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి." ఇలాంటి కామెంట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ అవుతున్నాయి.

**సురక్షితమే ముఖ్యం: ఇది ఒక హెచ్చరిక**

ఈ సంఘటన కేవలం ఒక విషాదం మాత్రమే కాదు, సోషల్ మీడియాలో ప్రచారం కోసం ప్రాణాలను రిస్కులో పెడుతున్న యువతకు ఇది ఒక గట్టి హెచ్చరిక. వ్యూస్, లైకులు తాత్కాలికమే కానీ, ప్రాణాలు శాశ్వతమైనవి. ఒక వీడియో తీసే ముందు, అది ఎంత రిస్క్‌గా ఉంటుందో ఆలోచించుకోవాలి. ముఖ్యంగా ప్రకృతి ప్రదేశాలైన జలపాతాలు, నదులు, కొండలు వంటి చోట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు, కానీ దాని శక్తిని తక్కువ అంచనా వేయకూడదు. చివరగా, గుర్తుంచుకోండి.. మీ ప్రాణాల కంటే విలువైన కంటెంట్ ఏదీ లేదు. సురక్షితంగా ఉండండి!

# ఈ ఎయిర్ ఇండియా విమానాలకు ఏమైంది?




విమాన ప్రయాణాల్లో ఒకప్పుడు దేశంలో అత్యున్నత సంస్థగా పేరు పొందిన ఎయిర్ ఇండియా.. ప్రస్తుతం వరుస సాంకేతిక లోపాలతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా గత వారం రోజుల్లో చోటుచేసుకున్న మూడు ఘటనలు ఈ సంస్థ నిర్వహణపై తీవ్ర సందేహాలకు తావిస్తున్నాయి.

**ముంబై-జోధ్‌పూర్ విమానంలో తీవ్ర గందరగోళం**

శుక్రవారం ఉదయం ముంబై నుంచి జోధ్‌పూర్ బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఎయిర్‌బస్ %సూ%319 సాంకేతిక లోపం కారణంగా టేకాఫ్ రద్దు చేసుకుంది. ముంబై టెర్మినల్%-%2 నుంచి 9:15 గంటలకు బయలుదేరాల్సిన ఈ విమానంలో 110 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే, టేకాఫ్ సమయంలో కాక్‌పిట్ సిబ్బంది ఒక ఆపరేషనల్ లోపాన్ని గుర్తించారు. భద్రతా కారణాల దృష్ట్యా విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఈ ఘటనతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం ఎదురైంది. విమానం నిలిపివేసిన తర్వాత, ప్రయాణికులను విమానం నుంచి దింపి, మళ్లీ సెక్యూరిటీ చెక్ ద్వారా పంపాల్సి వచ్చింది. ఆ తర్వాత వారికి ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేశారు. కొత్త విమానం మధ్యాహ్నం 12:36 గంటలకు బయలుదేరింది. ఈ అనూహ్య ఘటన కారణంగా ప్రయాణికులు దాదాపు 3 గంటల 30 నిమిషాల ఆలస్యంతో గమ్యస్థానానికి చేరుకున్నారు.

**వారం రోజులలో మూడో ఘటన**

ముంబై-జోధ్‌పూర్ ఘటన ఎయిర్ ఇండియాకు వారం రోజుల్లో ఇది మూడోది కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. అంతకు ముందు ఆగస్టు 17న ఢిల్లీ నుంచి లేహ్‌కు, ముంబై నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లాల్సిన విమానాలు కూడా సాంకేతిక సమస్యల కారణంగా రద్దు అయ్యాయి. ఈ రెండు ఘటనల్లోనూ ప్రయాణికులు 4 నుంచి 6 గంటల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా జ్యూరిచ్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఒక విమానం కూడా సాంకేతిక లోపం కారణంగా రద్దు చేయబడింది. ఇలాంటి వరుస ఘటనలు ఎయిర్ ఇండియా భద్రతా ప్రమాణాలపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

**టాటా గ్రూప్‌కు పెను సవాల్**

ప్రస్తుతం టాటా గ్రూప్ ఆధ్వర్యంలో ఉన్న ఎయిర్ ఇండియా తమ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఆధునికీకరణ, సేవల నాణ్యత పెంపుపై దృష్టి పెట్టింది. అయితే తరచుగా తలెత్తుతున్న సాంకేతిక లోపాలు ఈ ప్రయత్నాలను దెబ్బతీస్తున్నాయి. ప్రయాణికుల నమ్మకాన్ని పునరుద్ధరించాలంటే, ఎయిర్ ఇండియా కఠినమైన నిర్వహణ తనిఖీలు, భద్రతా ప్రమాణాలపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని విమానయాన రంగ నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే, ఈ ఘటనలు సంస్థ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉంది. ప్రయాణికుల భద్రత, సమయపాలన విషయంలో తగిన చర్యలు తీసుకోకపోతే, ఎయిర్ ఇండియాకు భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది.

# భారత క్రికెట్ లో ఓ శకం ముగిసింది... దిగ్గజ క్రికెటర్ రిటైర్మెంట్




భారత క్రికెట్ లో వాల్ అంటే రాహుల్ ద్రవిడ్.. 16 ఏళ్లు అతడు జట్టు బ్యాటింగ్ కు ఓ మూలస్తంభంగా నిలబడ్డాడు. అతడు రిటైర్మెంట్ సమయానికి అలాంటి మరొక బ్యాట్స్ మన్ దేశానికి అవసరమయ్యాడు. కానీ, ఎవరు దొరుకుతారు..? అని చూస్తే.. ద్రవిడ్ స్థానం తనదేనంటూ ఓ క్రికెటర్ ముందుకొచ్చాడు. పదేళ్లకు పైగా బ్యాటింగ్ భారాన్ని మోశాడు. నాలుగేళ్లుగా జట్టుకు దూరమైన అతడు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించాడు. అచ్చం ద్రవిడ్ తరహాలోనే చెక్కుచెదరని డిఫెన్స్ తో జట్టుకు పెట్టని కోటలా నిలిచిన అతడు ఇక ఆట చాలించాడు.

**నయ వాల్ తొలగింది...**

టెస్టు బ్యాట్స్ మన్ చతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకొన్నాడు. అన్ని ఫార్మాట్లకు అతడు రిటైర్మెంట్ ప్రకటించాడు. వాస్తవానికి పుజారా టెస్టుల్లో మాత్రమే ఉన్నాడు. వన్డేలకు అతడిని ఎప్పుడూ పరిగణించలేదు. ఒకటీ, రెండు అవకాశాలు ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదు. ఇప్పుడు టెస్టుల నుంచి కూడా తప్పుకొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగుతున్నట్లు ఆదివారం ప్రకటన చేశాడు. టీమ్ ఇండియా జెర్సీ ధరించడం, మైదానంలో జాతీయగీతం ఆలాపన, జట్టు కోసం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం తన జీవితంలో మధురానుభూతలని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

**రాజ్ కోట్ నుంచి...**

గుజరాత్ లోని రాజ్ కోట్ నగరానికి చెందిన పుజారా సౌరాష్ట్ర తరఫున దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఇప్పుడు అదే సంగతి గుర్తుచేసుకుంటూ.. రాజ్ కోట్ కుర్రాడు దేశానికి ఆడాడు అనే కల నెరవేరిందని, రాష్ట్రం, దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం అని పేర్కొన్నాడు. తన కెరీర్ ఎదుగుదలకు సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఎంతో సాయం చేసిందని చెప్పుకొచ్చాడు. ఇక మీదట మరింత సమయం కుటుంబానికి కేటాయిస్తానని తెలిపాడు.

**వందకు పైగా టెస్టుల్లో...**

పుజారా దేశానికి 103 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించాడు. 2010లో ఆస్ట్రేలియాపై తొలి టెస్టు ఆడాడు. 22 సెంచరీలు (ఇందులో మూడు డబుల్ సెంచరీలు), 35 హాఫ్ సెంచరీలు చేశాడు. మొత్తం 7,195 పరుగులు చేశాడు. పూర్తిగా టెస్టు బ్యాట్స్ మన్ గా ముద్ర పడిన పుజారా ఐదు వన్డేలే ఆడాడు. 51 పరుగులు సాధించాడు. 2023లో ఆస్ట్రేలియాపైనే చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు.

**ఫామ్ కోల్పోయి.. జట్టుకు దూరమై..**

2018-19 ఆస్ట్రేలియా టూర్ లో 1200 పైగా బంతులను ఎదుర్కొని మూడు సెంచరీలు సహా అద్భుతంగా రాణించిన పుజారా ఆ తర్వాత 2021-21 టూర్ లోనూ రాణించాడు. ఓ టెస్టులో 200 పైగా బంతులు ఆడి హాఫ్ సెంచరీ చేశాడు. ఈ రెండు సిరీస్ లను భారత్ గెలుచుకోవడం గమనార్హం. అయితే, పుజారా బ్యాటింగ్ మరీ నెమ్మదిగా సాగుతుండడం, ఇటీవలి కాలంలో దూకుడైన ఆట ఉన్న కుర్రాళ్లు దూసుకురావడంతో పుజారాకు జట్టులో చోటు కష్టమైంది. రెండేళ్ల కిందట ఆస్ట్రేలియాతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్లో ఆడిన పుజారాను మళ్లీ సెలక్టర్లు కరుణించలేదు. దీంతో 37 ఏళ్ల పుజారా క్రికెట్ కు వీడ్కోలు పలికాడు.

**నాలుగో క్రికెటర్...**

ఈ ఏడాది జనవరిలో ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, స్టార్ బ్యాట్స్ మెన్ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టులకు గుడ్ బై చెప్పారు. ఇప్పుడు పుజారా వంతు.

# సమస్య వాళ్లతోనే అంటున్న చంద్రబాబు.. ఇంతకీ వాళ్లెవరు..?

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేతల్లో చంద్రబాబు మొదటి వాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తన మామ దివంగత నందమూరి తారక రామారావు హయాంలో పార్టీ పనులు చూసుకుంటూ.. ఆ తర్వాత పార్టీలో కీలక రోల్ ప్లే చేసి సీఎంగా పదవి చేపట్టిన ఆయన ఉమ్మడి రాష్ట్రానికి ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పని చేసి రికార్డు సృష్టించారు. పార్టీ, పాలనను సమర్థవంతంగా నిర్వహించే నేతగా కూడా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఆ తరానికి ఈ తరానికి వారధిగా కూడా చంద్రబాబు నిలుస్తారు. అందుకేనేమో వృద్ధులకు ఎలాంటి పథకాలు కావాలి. యంగ్ స్టర్స్ కు ఎలాంటి పథకాలు కావాలో ఆయన తెలిసినంతగా బహుషా మరో నేతకు తెలియదేమో. ఇదే కాదు గీత దాటితే ఎవరిని ఎలా కంట్రోల్ చేయాలో కూడా ఆయనకు వెన్నతో పెట్టిన విద్యే. క్రమ శిక్షణకు మారు పేరుగా నిలుస్తున్న చంద్రబాబును చూసి సీనియర్ నాయకులు కూడా వణికిపోతుంటారంటే సందేహం లేదు.

**గీత దాటుతున్న వారిపై నిఘా..**

ఇటీవల పార్టీలో వివాదాలు మొదలయ్యాయి. తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో బాబు సీరియస్ గా ఉన్నారని తెలుస్తోంది. పార్టీలో గొడవలు తెచ్చే నేతలకు పలు మార్లు హెచ్చరికలు కూడా జారీ చేశారట. రీసెంట్ గా గీత దాటుతున్న ఎమ్మెల్యేలకు సంబంధించిన బాబు కీలకమైన వ్యాఖ్యలు చేశారట. పార్టీలోని సీనియర్ నాయకులకు క్రమ శిక్షణ గురించి తెలిసే ఉంటుందని అందుకే వారు నిబంధనల మేరకు నడుచుకుంటారని, కొత్తగా ఎన్నికైన వారు కొంత బాధ్యతారాహిత్యంతో ఉంటున్నారని ఆయన అన్నారు. ఇలాంటి 35 మంది ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడినట్లు చెప్పారు.

**ఇటీవల 35 మంది ఎమ్మెల్యేలతో సమావేశం..**



35 మంది ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి తన వ్యవహారం గురించి చెప్పుకచ్చారు. 'ఎవరైనా సరే గాడి తప్పుతున్నట్లు అనిపిస్తే ఒకసారి పిలిచి చెప్తాను.. పద్ధతి మార్చుకోకుంటే మరోసారి పిలిచి చెప్తాను.. అయినా మార్చుకోకుంటే.. మూడో సారి కఠినంగా వ్యవహరిస్తా.. అయితే రెండో సారి మూడో సారి పిలవాలా? వద్దా? అనేది వారి ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది' అని చెప్పారు. అయితే బాబు వార్నింగ్ ఇస్తారు కానీ.. చర్యలు తీసుకోరు అన్న వారు కూడా లేకపోలేదు. గీత దాటుతున్నారని తెలిసిన తర్వాత వార్నింగ్ లు ఏంటి? వారిని ఎందుకు ఉపేక్షించాలంటూ ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**వార్నింగ్ లు వద్దు.. యాక్షన్ కావాలంటున్న నేతలు..**

పార్టీ పేరు చెడగొడుతున్న వారికి వార్నింగ్ లు ఏంటని, చేతల్లో చూపించాలని సీనియర్ నాయకులు బాబుకు సూచిస్తున్నారు. కొత్తగా ఎన్నికైన వారిలో ఇవన్నీ తాటాకు చప్పుళ్లలా ఉంటాయని, యాక్షన్ లోకిదిగిన తర్వాతే మిగతా వారు భయపడతారని కొందరు అంటున్నారు. కఠినంగా వ్యవహించాలని కోరుతున్నారు.

# భారత్ - చైనా వాణిజ్యంలో పెరుగుదల

భారత్, చైనాల మధ్య వాణిజ్యం కొత్త పుంతలు తొక్కుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో (ఏప్రిల్-జూలై), భారత్ నుంచి చైనాకు ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలపడుతున్నాయని స్పష్టం చేస్తోంది.

**ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల**

అధికారిక గణాంకాల ప్రకారం, ఏప్రిల్ నుంచి జూలై వరకు భారత్ నుంచి చైనాకు ఎగుమతులు 20 శాతం పెరిగి %వి%5.76 బిలియన్లకు (సుమారు రూ.50,112 కోట్లు) చేరుకున్నాయి. ఈ పెరుగుదల గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే స్థిరంగా ఉంది. మే నెలలో అత్యధికంగా %వి%1.63 బిలియన్ల ఎగుమతులు నమోదయ్యాయి, ఇది భారత్ వాణిజ్య వృద్ధికి సానుకూల సంకేతం.

**ముఖ్య రంగాల్లో వృద్ధి**

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో చైనాలో భారతీయ ఉత్పత్తుల



డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా కొన్ని కీలక రంగాల్లో అసాధారణమైన వృద్ధి కనిపించింది. పెట్రోలియం ఉత్పత్తులు దాదాపు రెట్టింపు పెరిగి %వి%883 మిలియన్లకు చేరుకున్నాయి. ఎలక్ట్రానిక్స్ మూడు రెట్లు పెరిగి %వి%521 మిలియన్లకు చేరాయి. రసాయనాలు 16.3% వృద్ధితో %వి%335.1 మిలియన్లకు పెరిగాయి. జెమ్స్ అండ్ జ్యువెలరీ 72.7% పెరుగుదలతో అత్యధిక వృద్ధి సాధించాయి. ఈ గణాంకాలు భారత్ ఎగుమతుల సామర్థ్యం బలోపేతం అవుతోందని, అంతర్జాతీయ మార్కెట్లో భారత్ పోటీ పడుతోందని సూచిస్తున్నాయి.

**దిగుమతులు, దౌత్య సంబంధాలు**

భారత్ చైనా నుంచి దిగుమతులు కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక వస్తువుల కోసం కొనసాగుతున్నాయి. ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా జరగడం, భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ సంబంధాలు మరింత బలపడతాయని సూచిస్తున్నాయి.

ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల మధ్య కూడా భారత్-చైనా వాణిజ్యం కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఈ వృద్ధి ధోరణి కొనసాగితే, రాబోయే రోజుల్లో ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు మరింత స్థిరపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# ఫ్యాన్ స్పీడ్

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై వైసీపీ పోరుకుసిద్ధమవుతుంది. ఈ మేరకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సెంటిమెంట్ గా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను దశలవారీగా ప్రయివేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్నదన్న కార్మిక సంఘాలకు వైసీపీ అండగా నిలవాలని నిర్ణయించింది. ఈ మేరకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు, విశాఖ కార్పొరేటర్లతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ను రూపొందించేందుకు సిద్ధమయ్యారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు తమ ఉద్యమంలో కలిసి రావాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపు నిచ్చారు.

**బలహీనంగా ఉండటంతో...**

ఉత్తరాంధ్రలో వైసీపీ బలహీనంగా ఉంది. గత ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో వైసీపీని ప్రజలు ఆదరించలేదు. జిల్లాలకు జిల్లాలే తుడిచిపెట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను తమ భుజానకెత్తుకునేందుకు ఫ్యాన్ పార్టీ సిద్ధమయింది. ఇప్పటికే నిన్న విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు వత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసి రాష్ట్రప్రభుత్వానికి పంపారు. దాదాపు 32 డిపార్ట్ మెంట్లలో ఉద్యోగులను తొలగిస్తున్నందున పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించింది. దశలవారీగా ఈ పోరాటాన్ని ప్రారంభించాలని వైసీపీ నాయకత్వం కూడా నిర్ణయించింది.

**రాజకీయ పార్టీలతో కలిసి...**

వామపక్ష పార్టీలతో పాటు ఇతరగా కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో కలిసి ఉత్తరాంధ్రలోనే కాకుండా ఏపీ వ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించాలన్న యోచనలో వైసీపీ ఉంది. ముందుగా స్థానిక నాయకత్వంతో కలిసి పోరాటం చేయడంతో పాటు కార్మిక సంఘాలను అవసరమైతే ఢిల్లీకి తీసుకెళ్లి జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని దాదాపుగా నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలకు మద్దతుగా త్వరలోనే విశాఖకు వచ్చేందుకు కూడా పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద ఉత్తరాంధ్రలో తిరిగి నిలదొక్కుకునేందుకు వైసీపీ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆయుధంగా మలుచుకుంటుంది. మరి ఈ ఉద్యమం వైసీపీకి ఎంత మేరకు లాభిస్తుందన్నది చూడాలి.

# మూడ్ మార్చేసే ఇంటీరియర్ డిజైనింగ్!

**మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంత సేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది.**



మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంతసేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది. ఇదే పరోక్షంగా మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేస్తుందట! అందుకే నచ్చినట్లుగా ఇంటిని అలంకరించుకుంటే.. రోజువారీ ఒత్తిళ్లు, ఆందోళనలు దూరమై హ్యాపీగా ఉండచ్చని పలు అధ్యయనాలూ చెబుతున్నాయి. మరి, ఇంటీరియర్ డిజైనింగ్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం రండి..







**గదిని బట్టి.. రంగులు!**

ఇంటి అందాన్ని పెంచడంలో, మనసుకు ఆహ్లాదాన్ని అందించడంలో రంగులది కీలక పాత్ర! నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే.. అటు సౌకర్యంగా, ఇటు ప్రశాంతంగా అనిపిస్తుంది. ఈ క్రమంలోనే శరీరంలో డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ విడుదలవుతుంది. తద్వారా సంతోషంగా ఉండగలుగుతాం. అయితే మనకు నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే సరిపోదు.. గది అవసరాల్నీ పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. పడకగదిలో రిలాక్సవుతాం.. కాబట్టి ఇక్కడ మనసుకు ప్రశాంతతను అందించే లేత రంగులు, అందులోనూ ముఖ్యంగా పేస్టల్ షేడ్స్‌ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. అదే కిచెన్‌లో పనిచేసే సమయంలో ఉత్సాహంగా, చురుగ్గా ఉంటేనే పనులు సమయానికి పూర్తవుతాయి. కాబట్టి ఈ గదికి ఎరుపు, ఆరెంజ్.. వంటి రంగులు నప్పుతాయంటున్నారు. ఇలా గది ప్రత్యేకతల్ని బట్టి రంగుల్ని ఎంచుకుంటే.. అది ఆటోమేటిక్‌గా మనసుపై సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.

**'బయోఫిలిక్ డిజైన్' తెలుసా?**

ఇంటి అలంకరణ విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. కొందరు తమ ఇల్లు మోడ్రన్‌గా ఉండాలని కోరుకుంటే.. మరికొందరు వింటేజ్ థీమ్‌ని ఎంచుకుంటుంటారు. అయితే ఎవరి ఇష్టాయిష్టాలెలా ఉన్నా.. బయోఫిలిక్ ఇంటీరియర్ ట్రెండ్ మాత్రం ఇటు ఆరోగ్యాన్నిస్తూనే, అటు మానసిక ప్రశాంతతను, సౌకర్యాన్ని సొంతం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు కారణం.. ఈ డిజైనింగ్ కోసం వాడే అలంకరణ వస్తువులన్నీ పర్యావరణహితమైన ఉత్పత్తులతో తయారుచేయడమే! చెక్క, మట్టి, ఓక్ చెట్టు బెరడు, రాటెన్ (ఇదో రకమైన కలప), ఉన్ని.. వంటి ప్రకృతి అందించే మెటీరియల్స్‌ని ఈ వస్తువుల తయారీలో ఉపయోగిస్తుంటారు డిజైనర్లు. బయోఫిలిక్ ఇంటీరియర్‌లో భాగంగా ఇలా గృహాలంకరణ వస్తువులే కాదు.. ఇంట్లోనే గోడకు లేదంటే ఓ మూలన చిన్నపాటి గార్డెన్‌లా పచ్చదనాన్ని ఏర్పాటుచేసుకోవడం, ప్రకృతి రమణీయతతో కూడిన ఆర్ట్‌వర్క్‌కి ఇంట్లో చోటివ్వడం.. వంటివీ దీని కిందకే వస్తాయి. ఈ తరహా ఫర్నిచర్/గృహాలంకరణ వస్తువులతో మానసిక ఒత్తిళ్లు, ఆందోళనలు తగ్గి.. ప్రశాంతత చేకూరుతుందని పలు అధ్యయనాల్లోనూ తేలింది.

**వెలుతురు..ఓఎక్కడెలా?**

వెలుతురు కూడా మన మనసును ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ సహజసిద్ధమైన లైటింగ్ కీలక పాత్ర పోషిస్తుందట! అయితే చాలామంది వేడిగా ఉందని, దుమ్ము వస్తుందని.. పగటి పూటే తలుపులు, కిటికీలు మూసేసి.. వెలుతురు కోసం లోపలి లైట్లను ఉపయోగిస్తుంటారు. కానీ పగటి పూట వచ్చే న్యాచురల్ లైటింగ్‌ని ఇలా అడ్డుకోకుండా పూర్తిగా ఆస్వాదించినప్పుడే మనసుకు సాంత్వన చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే పగటి పూట తలుపులు, కిటికీలు తీసే ఉంచడం మంచిది. అవసరమైతే వాటికి పల్చటి కర్టెన్లు వేలాడదీస్తే.. వేడి, దుమ్ము బెడద లేకుండా ఉంటుంది.. ఇంట్లో వెలుతురు కూడా పడుతుంది. ఇక రాత్రి పూట ఇంట్లో ఉపయోగించే లైటింగ్ కూడా గది అవసరాల్ని బట్టి ఉండాలంటున్నారు నిపుణులు.

లివింగ్ రూమ్‌లో ఎక్కువ సమయం గడుపుతుంటాం కాబట్టి ఈ గదిలో ప్రకాశవంతమైన లైట్లను ఏర్పాటుచేసుకోవాలి. ఇక గోడలపై ఏర్పాటుచేసిన ఫొటో ఫ్రేములు, ఆర్ట్ వర్క్‌పై మినీ స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే గదికి అందమొస్తుంది.. మనసుకు ఆహ్లాదంగానూ అనిపిస్తుంది.

అదే పడకగదిలో లైటింగ్ ఎంత తక్కువగా ఉంటే మనసుకు అంత ప్రశాంతంగా ఉంటుందంటున్నారు నిపుణులు. పుస్తకాలు చదువుకోవడానికి, వర్క్ చేసుకోవడానికి టేబుల్ ల్యాంప్స్‌ని ఉపయోగించచ్చు.

ఇక డైనింగ్ టేబుల్‌పై షాండ్లియర్/పెండెంట్ లైటింగ్ ఏర్పాటుచేసుకుంటే.. ఆ గదికి ఆ లైటింగ్ సరిపోతుంది. లైట్ల ఫోకస్ ఎక్కువగా లేకుండా ప్రశాంతమైన భావన కలుగుతుంది.

ఇక కిచెన్‌లోనూ లైటింగ్ ప్రకాశవంతంగా ఉండాల్సిందే! అయితే దీంతో పాటు క్యాబినెట్స్, అరల్లో స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే.. అక్కడి వస్తువులు సులభంగా వాడుకోవడానికి వీలుగా ఉంటుంది.. కంఫర్టబుల్‌గానూ అనిపిస్తుంది. ఇది పరోక్షంగా మానసిక ప్రశాంతతనూ పెంచుతుంది.

**గోడలకు.. 'డోపమైన్' టచ్!**

ఇంటి అలంకరణ అనగానే చాలామంది గోడల పైనే తమ దృష్టి కేంద్రీకరిస్తారు. తమకు నచ్చిన చిత్రాల్ని గోడలకు తగిలించడం లేదంటే చక్కటి వాల్ ఆర్ట్ వేయించుకోవడం, వాల్‌పేపర్‌ని అతికించుకోవడం.. ఇలా ఎవరి స్టైల్ వారిది! అయితే అందులోనూ 'అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ (వాస్తవికతకు సంబంధం లేకుండా గీసే చిత్రకళ)', 'పర్సనలైజ్‌డ్ ఆర్ట్ (వ్యక్తిగత అభిరుచులు, జ్ఞాపకాలతో చిత్రాల్ని రూపొందించడం)'.. వంటివి మనసుకు ఎక్కువ సంతోషాన్ని, ప్రశాంతతను అందిస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే వీటిని 'డోపమైన్ డెకార్'గా నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి ఇలాంటి అలంకరణ వస్తువులతో గోడలకు హంగులద్దితే ఇటు ఇంటికి అందం తీసుకురావచ్చు.. అటు మనసునూ ప్రశాంతంగా ఉంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు.



సాంచి రాయ్ తన లేటెస్ట్ లుక్‌లో గ్రేస్‌తో మెరుస్తోంది

# పిక్‌టాక్ : అందాల శర్మ మిర్రర్ సెల్ఫీ



సేవ్ ది టైగర్స్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకులకు చేరువ అయిన ముద్దుగుమ్మ దేవియాని శర్మ. అంతకు ముందు కూడా చాలా సినిమాల్లో కనిపించిన దేవియాని శర్మ పెద్దగా గుర్తింపు దక్కించుకోలేదు. కనీసం నోటెడ్ కూడా కాలేదు. ఎప్పుడైతే ఆ వెబ్ సిరీస్‌లో కనిపించిందో అప్పటి నుంచి మంచి గుర్తింపు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమె ఫాలోయింగ్ పెరిగింది. సినిమా ఆఫర్లు వరుసగా రావడం లేదు, కానీ ఖచ్చితంగా మంచి ఫ్యూచర్ ఉన్న నటి అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అవ్వడం వల్ల సోషల్ మీడియాలో ఈమె ఏ ఫోటోలు షేర్ చేసినా అందరి దృష్టిని ఆకర్షించడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈ ఫోటోలతో దేవియాని శర్మ తన అందంతో ఆకట్టుకుంది.

**స్కిన్ షో తో దేవియాని శర్మ**

సోషల్ మీడియాలో సెలబ్రిటీలు రెగ్యులర్‌గా ఫోటోలు షేర్ చేస్తూ ఉంటారు. అయితే చాలా తక్కువ మంది ఫోటోలు మాత్రమే చూడగానే వావ్ అనిపించేంత అందంగా ఉంటాయి, కొన్ని ఫోటోలు చూడగానే అంతకు మించి అన్నట్లుగా అనిపిస్తాయి. దేవియాని శర్మ ఎప్పుడు ఫోటోలు షేర్ చేసినా నెటిజన్స్ వావ్ అంటూ తెగ కామెంట్స్ చేస్తారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడం వల్ల ఎలాంటి ఔట్ ఫిట్ ధరించిన భలే సెట్ అవుతుందని చాలా మంది అంటూ ఉంటారు. సాధారణంగానే హీరోయిన్స్ స్కిన్ షో చేస్తూ ఉంటారు. ఇక ఈమె స్కిన్ షో ఫోటోలు సైతం రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో షేర్ అవుతూ ఉంటాయి. కొందరు స్కిన్ షో చేస్తే చూడ్డానికి ఎబ్బెట్టుగా ఉంటుంది. కానీ దేవియాని శర్మ మాత్రం చూడముచ్చటగా ఉంటుంది.

**మిర్రర్ సెల్ఫీతో అందం**

తాజా మిర్రర్ సెల్ఫీలో బ్లాక్ పాయింట్ వేసుకుని, బ్లాక్ టాప్‌లో నడుము అందం చూపిస్తూ దేవియాని శర్మ చూపరులను ఆకట్టుకుంది. దేవియాని శర్మ ఇంతం అందంగా ఉన్నా ఆఫర్లు దక్కక పోవడం విచారకరం అంటూ కొందరు ఇన్‌స్టాలో పాపం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నటిగా దేవియాని శర్మ ముందు ముందు మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నారు. తప్పకుండా ఈమె ఈ అందంతో మరిన్ని ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. స్టార్ హీరోయిన్స్‌కి ఏమాత్రం తగ్గకుండా దేవియాని శర్మ అందంగా ఉందని, ఆమె సోషల్ మీడియాలో ఇదే రేంజ్‌లో అందంగా ఉన్న ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఖచ్చితంగా ముందు ముందు అయినా ఆఫర్లు దక్కించుకుంటుంది అంటూ చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**సేవ్ ది టైగర్స్ ముద్దుగుమ్మ షో**

సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్ లో మొత్తం ముగ్గురు ముద్దుగుమ్మలు ఉంటాయి. అయినా కూడా ఈమెకు ప్రత్యేకంగా గుర్తింపు లభించింది. ఆ వెబ్ సిరీస్‌లో పెద్దగా స్కిన్ షో చేయలేదు, అయినా కూడా ఆమె పాత్ర గురించి ప్రముఖంగా మాట్లాడుకున్నారు. అంతే కాకుండా దేవియాని శర్మ నటన గురించి ఆ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ సమయంలో ప్రముఖంగా చర్చ జరిగింది. అందంతో పాటు యాక్టింగ్ ప్రతిభ కూడా ఉన్న దేవియాని శర్మ తప్పకుండా ముందు ముందు ఇండస్ట్రీలో నిలదొక్కుకుంటుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. కేవలం తెలుగు సినిమాల్లో మాత్రమే కాకుండా ఈమె ఇతర భాషల సినిమా ఇండస్ట్రీలోనూ ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేయడం మంచిదని, అక్కడ అయినా ఈమెకు లక్ కలిసి వస్తుందేమో అనే అభిప్రాయంను కొందరు కామెంట్స్ రూపంలో షేర్ చేస్తున్నారు.



రెయిన్‌బో హార్ట్ మరియు సాల్టీ హెయిర్‌తో కృతి సనన్ వైబ్రెంట్ వెకేషన్ వైబ్స్

# ఆ ముగ్గురు పాలిట మెగాస్టార్ ఆపద్బాంధవుడు!

సీనియర్ బ్యూటీలు త్రిష, నయనతార కెరీర్ ఇప్పుడంత స్పీడ్ గా లేదు. సెలక్టివ్ గా సినిమాలు చేస్తు న్నారు. హీరోల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. హీరోతో పాటు కథ కూడా పక్కాగా ఉంటేనే కమిట్ అవుతున్నారు. లేదంటే వచ్చిన అవకాశాలే వదులుకుంటున్నారు. ఈ క్రమంలో రిలీజ్ లకు గ్యాప్ ఏర్పడుతుంది. త్రిష గత చిత్రం – థగ్ లైఫ్ – బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్గా నమోదైంది. దానికంటే ముందు రిలీజ్ అయిన – గుడ్ బ్యాడ్ అగ్లీ – పర్వాలేదనిపించినా ఆ సక్సెస్ ని – థగ్ లైఫ్ – తో కొనసాగించ లేకపోయింది.



**వరుస వైఫల్యాలు:**

దీంతో చేతిలో ఉన్న –విశ్వంభర – చిత్రం కీలకంగా మారింది. ఇందులో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. మరో సినిమా –కురుప్పు– కూడా చేస్తోంది. కానీ భారీ అంచనాలు మాత్రం చిరంజీవి చిత్రంపైనే పెట్టుకుంది. –విశ్వంభర– సక్సెస్ తో తెలుగులో బిజీ అవ్వాలని ఆశపడుతోంది. మరోవైపు లేడీ సూపర్ స్టార్ గా నీరాజనాలు అందుకుంటోన్న నయనతార కూడా వరుస పెయిల్యూర్స్ లో ఉంది. –జవాన్– తర్వాత చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. సమ్మర్ లో రిలీజ్ అయిన–టెస్ట్– కూడా ఫెయిలైంది.

**157పైనే ఆశలన్నీ:**

దీంతో ఈ ఏడాది మరో రిలీజ్ కూడా చేతిలో లేదు. కొత్త సినిమాలు చాలా చేస్తోంది. కానీ అవన్నీ రిలీజ్ అయ్యేది వచ్చే ఏడాదే. అందులో చిరంజీవి 157వ చిత్రం కీలకంగా మారింది. ఇందులో చిరుకు జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. 2026 రిలీజ్ లు అన్నింకంటే ఎక్కువగా నయన్ పోకస్ చేసిన చిత్రం కూడా ఇదే. అందుకే సినిమా కోసం తన ప్రమోషన్ నిబంధనలు సైతం పక్కన బెట్టి ప్రచార బరిలో నిలిచింది.

**చిరంజీవి సక్సెస్ కీలకం:**

మరోవైపు బాలీవుడ్ నటి మౌనీ రాయ్ కూడా చిరంజీవి సినిమాపైనే ఆశలు పెట్టుకుంది. విశ్వంభర–లో అమ్మడు ఐటం పాటలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఎంతో మంది భామల్ని పరిశీలించి చివరిగా మౌనీ రాయ్ ని తీసుకున్నారు. ఆమెకు కూడా సరైన అవకాశాలు లేని సమయంలో వచ్చిన గొప్ప ఛాన్స్ ఇది. ఈ పాటతో సక్సెస్ అందుకుని నటిగా, నర్తకిగా బిజీ అవ్వాలనే ప్లాన్ లో ఉంది. మరి ఈ ముగ్గురికి మెగాస్టార్ ఎలాంటి సక్సెస్ ఇస్తారో చూడాలి.